సాక్షి
జగిత్యాల
బుధవారం ¦ 11 ¦ సెప్టెంబర్ ¦ 2024

న్యూస్‌రీల్

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేద్దాం



వన నర్సరీని పరిశీలిస్తున్న రవిప్రసాద్

మల్లాపూర్: అటవీ సంపదను రక్షించేందుకు ప్రజలు సహకరించాలని డీఎఫ్‌వో రవిప్రసాద్ అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నిర్వహిస్తున్న వననర్సరీ, రిజర్వ్ ఫారెస్టును అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. రహదారుల వెంట ఉన్న మొక్కలు నాటాలన్నారు. కలప అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలని, అటవీ సంరక్షణకు రేంజ్, సెక్షన్, బీట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గోదావరి తీరంతోపాటు అటవీప్రాంత గ్రామాల నుంచి అక్రమ కలప సరఫరాను అరికట్టాలని ఆదేశించారు. ఆయన వెంట రాయికల్ రేంజ్ అధికారి భూమేశ్, డిప్యూటీ రేంజ్ అధికారి, మల్లాపూర్ ఇన్‌చార్జి సెక్షన్ అధికారి పద్మ, బీట్ అధికారి వాసింపీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

జగిత్యాలటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. టోకెన్ సమ్మెలో భాగంగా బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఏళ్ల తరబడిగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నాలు, నిరసనలు, దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రటించినట్లు రూ.10వేల కనీస వేతనం చెల్లించేలా జీవో విడుదల చేయాలని, మెనూ చార్జీలు రూ.25కు పెంచాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు సుతారి రాములు, వెన్న మహేశ్, హనుమంతు, దేవదాస్, కిరణ్‌కుమార్, ముక్రం, శారద, లక్ష్మి, జమున, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సెలవులో కోరుట్ల ఆర్డీవో

- మెట్‌పల్లి ఆర్డీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు

కోరుట్ల: కోరుట్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ 20 రోజుల పాటు సెలవు పెట్టినట్లు తెలిసింది. దీంతో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆనంద్‌కుమార్ అకస్మాత్తుగా సెలవుపై వెళ్లడం రెవెన్యూవర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ఆయన సెలవు వెనక వ్యక్తిగత కారణాలా..? లేక రాజకీయ ఒత్తిళ్లా..? అంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

అగ్నివీర్, వాయుసేన ఉద్యోగాలను అందిపుచ్చుకోండి

- ఎయిర్‌ఫోర్స్ అధికారి అమిత్ గోస్వామి

జగిత్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నివీర్, వాయుసేన ఉద్యోగాలను యువత అందిపుచ్చుకోవాలని ఎయిర్‌ఫోర్స్ అధికారి అమిత్‌గోస్వామి, సురేందర్ సింగ్ సూచించారు. స్థానిక ఉపాధి కల్పన అధికారి ఆధ్వర్యంలో పట్టణంలో అగ్నివీర్, వాయుసేన ఉద్యోగ అవకాశాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్ ఉత్తీర్ణులై పదిహేడున్నర ఏళ్ల నుంచి 21ఏళ్ల మధ్య వయసున్న యువత దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. 2025 జనవరి 14, 15న అబ్బాయిలకు, జనవరి 18న అమ్మాయిలకు అగ్నివీర్ ర్యాలీ సికింద్రాబాద్‌లో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి బింగి సత్యమ్మ, ఉన్నత విద్యాశాఖ సమన్వయకర్త ప్రొఫెసర్ అశోక్, ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, లెఫ్టినెంట్ రాజు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ’ హీట్!

ఆశావహుల ముందస్తు ప్రచారం

- వచ్చేనెల ఒకటి నుంచి ఎన్‌రోల్‌మెంట్ మొదలు
- పట్టభద్రుల వివరాల సేకరణ
- ప్రధాన పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు
- మున్ముందు మరింత పెరగనున్న పోటీ



బీఎస్ రావు రవీందర్‌సింగ్ నరేందర్‌రెడ్డి వి. రాజేందర్‌రావు పి.సుగుణాకర్‌రావు రాణీరుద్రమ



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహులు స్పీడు పెంచారు. అక్టోబరు ఒకటి నుంచి పట్టభద్రులు ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేందుకు ఇటీవల ఎన్నికల కమిషన్ అనుమతించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆశావహులు స్పీడు పెంచారు. ఎవరికి వారు తాము అభ్యర్థులమన్న సంకేతాలు ఇస్తున్నారు. మరికొందరు అడుగు ముందుకేసి అప్పుడే మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ పోటీలో అధికార కాంగ్రెస్‌తోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీ అభ్యర్థులు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఇంట గెలిచి, రచ్చ గెలవాలన్న సామెత వీరిలో చాలా మందికి వర్తించకపోవడం గమనార్హం. పార్టీ తమకు వేదిక అవుతుందని, టికెట్ రాకపోయినా బరిలో ఉండేందుకు సిద్ధంగా ఉండటం విశేషం. మున్ముందు ఈ పోటీ ఇటు అన్ని పార్టీల్లో పెరిగి, స్వతంత్రుల సంఖ్యా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

గులాబీ పార్టీలో ఇద్దరి మధ్యే పోటీ

బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో బీఎస్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.బీఎస్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ప్రముఖంగా ఉన్నారు. బీఎస్‌రావు ముందు నుంచి ఎమ్మెల్సీ స్థానం కోసం గ్రౌండ్‌వర్క్ చేస్తున్నారు. కొన్నేళ్లుగా పేదలకు చేస్తున్న ఉచిత మోకీలు ఆపరేషన్లతోపాటు.. ఎమ్మెల్సీ ఎన్నికలే లక్ష్యంగా మేధావులతో సమావేశాలు, ఎంఐఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడిగా వైద్య, పారా మెడికల్ సిబ్బంది మద్దతు కోరుతున్నారు. నిరుద్యోగులకు పోటీపరీక్షల మెటీరియల్స్ అందజేస్తున్నారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ కూడా ఎమ్మెల్సీ రేసులో సీరియస్‌గానే ఉన్నారు. గత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో తనకు వచ్చిన ఓట్లు, మేయర్‌గా అందించిన సేవలు, ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు చేసిన సేవల ఆధారంగా మద్దతు కూడగడుతున్నారు.

నరేందర్‌రెడ్డి వర్సెస్ వెలిచాల..

కాంగ్రెస్ నుంచి ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. ప్రస్తుతం ఇద్దరు బలమైన అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఒకరు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి కాగా, మరొకరు ఇటీవల కరీంనగర్ పార్లమెంటు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెలిచాల రాజేందర్‌రావు. నరేందర్ రెడ్డి కాంగ్రెస్ తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తుందని బలంగా నమ్ముతున్నారు. టికెట్ రాకపోయినా స్వతంత్రుడిగానైనా పోటీలో నిలబడాలన్న ఆలోచనలో ఉన్నారు. ఉత్తర తెలంగాణలో తన విద్యాసంస్థలు, తనకున్న పరిచయాలతో గ్రాడ్యుయేట్ల వివరాలు ఎన్‌రోల్‌మెంట్ కోసం సేకరిస్తున్నారు. వెలిచాల రాజేందర్ రావు ఎంపీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో క్రియాశీలకంగా ఉన్నారు. సిరిసిల్ల చేనేతకు ప్రభుత్వ బ్రాండింగ్, ట్రేడింగ్‌లో శిక్షణ, గ్రాడ్యేయేట్లకు మేనిఫెస్టోలతో ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్సీగా అవకాశమిస్తే సిద్ధమేనని, పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యమని, ఎవరికి టికెట్ ఇచ్చినా బలపరుస్తానని స్పష్టం చేస్తున్నారు.

కమలనాథుల్లో ఉత్కంఠ..

బీజేపీలోనూ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరి మధ్య తీవ్రపోటీ నెలకొంది. వారిలో ఒకరు సీనియర్ నేత పొల్సాని సుగుణాకర్ రావు, మరొకరు రాణీ రుద్రమ. వీరిద్దరూ తమకు టికెట్ కావాలని అధిష్టానం వద్ద ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీలో సీనియర్ నేత అయిన తనకు ఇటీవల అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో అవకాశం దక్కలేదని, ఈసారి ఎలాగైనా తనకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాల్సిందేనని సుగుణాకర్ రావు పట్టుబడుతున్నారు. రాణీరుద్రమకు సిరిసిల్ల నుంచి అవకాశం కల్పించారని, కాబట్టి ఈసారి తమకు ఇవ్వాల్సిందేని సుగుణాకర్‌రావు వర్గం వాదిస్తోంది. మరోవైపు రాణీ రుద్రమ మాత్రం తన ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

పథకాల అమలులో అలసత్వం వద్దు

- కలెక్టర్ సత్యప్రసాద్



కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, తదితరులు

జగిత్యాల: ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం వద్దని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రుణాలు రూ.868 కోట్లు మంజూరు చేశామని, వీధి వ్యాపారులకు మూడో విడత 1290 మందికి రుణాలు ఇచ్చామని, సూక్ష్మ, మధ్యతరహా రుణాలు 241 మందికి మంజూరు చేశామని పేర్కొన్నారు. పీఎంఎఫ్‌ఎంఈ కింద ఇప్పటికే 328 యూనిట్లు మంజూరు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్వశక్తి సంఘాలకు రూ.242 కోట్లు, పట్టణ ప్రాంత మహిళలకు రూ.23 కోట్లు అందించామని తెలిపారు. ప్రైవేట్ బ్యాంకులు కొన్ని స్కీంలలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంకర్లు, అధికారులు అన్నివివరాలు ఉంటేనే సమావేశానికి రావాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంకుమార్, డీఆర్డీవో రఘువరణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిశోర్ పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి గ్రామంలో ఫాగింగ్ చేయాలని కలెక్టర్ అన్నారు. వైద్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. జిల్లాలో ఫీవర్, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తున్నాయని, అన్ని ఆస్పత్రుల్లో పరీక్షలు చేయాలని సూచించారు. జ్వరాలున్న చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీఎంహెచ్‌వో సమీయొద్దీన్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారిని చాకలి

తెలంగాణ ఉద్యమకారిణి, వీరవనిత చాకలి ఐలమ్మ అని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. సబ్బండవర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక ఐలమ్మ అన్నారు. ఆమె ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. అదనపు కలెక్టర్ రాంబాబు, ఏవో హన్మంతరావు పాల్గొన్నారు.

మల్యాల పాఠశాల తనిఖీ

మల్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సత్యప్రసాద్ ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనతీరు, విద్యార్థులు మననం చేసుకునే విధానాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలను పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. డీపీవో రఘువరన్, తహసీల్దార్, ఎంపీడీవో, విద్యాధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకే అంగన్‌వాడీ కేంద్రాలు

పెగడపల్లి: మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉపయోగపడుతున్నాయని కలెక్టర్ అన్నారు. మండలంలోని నామాపూర్‌లో మంగళవారం మల్యాల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. డీడబ్ల్యూవో నరేశ్, ఆర్డీవో మధుసూదన్, డీపీవో రఘువరన్ హాజరయ్యారు. చిన్నారుల ఆరోగ్యంపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చిన్నారులను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. చిన్నారులతో కలెక్టర్ స్వయంగా అక్షరాభ్యాసం, చేయించారు. అన్నప్రాసన చేసి గొప్ప చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆశీర్వదించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆర్యోగ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యసేవలపై వైద్యాధికారి నరేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకుముందు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు నట్టల మందు నివారణ పంపిణీలో పాల్గొన్నారు. జిల్లా వెటర్నరీ అధికారి వేణుగోపాల్‌రావు, డీఎంహెచ్‌వో సమీయొద్దీన్, ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్, సీడీపీవో వీరలక్ష్మీ, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుభద్ర, మహేశ్వరీ, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపంతోనే విషజ్వరాలు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు కరువు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్ : పారిశుధ్య లోపంతోనే విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్తంభంపల్లిలో సోమవారం విషజ్వరంతో మృతి చెందిన లింగమూర్తి కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించారు. అనంతరం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతి కార్యక్రమంతో పల్లెలను శుభ్రంగా ఉంచడంతో విషజ్వరాల ఊసే లేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలలుగా గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయయని, దీంతో విషజ్వరాలు ప్రబలి ప్రజలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో మందులు కూడా లేవన్నారు. చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించడం లేదని, ఆస్పత్రుల్లో సౌకర్యాల లేవని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే విరుచుకుపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంచందర్, జగన్, ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు సత్యం, మల్లేశం, చంద్రారెడ్డి, నర్సయ్య, తిరుపతి, అశోక్ పాల్గొన్నారు.

పంచాయతీలతోనే తండాల అభివృద్ధి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఎమ్మెల్యేసంజయ్‌తో గోండుగూడ వాసులు

సారంగాపూర్: తండాలను పంచాయతీలుగా చేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగేళ శివారు ఆదివాసీ గోండుగూడెంను ప్రభుత్వం పంచాయతీగా ఏర్పాటు చేసినందుకు గిరిజనులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ అయితేనే స్థానిక సంస్థల ప్రతినిధులుగా గెలిచి ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గిరిజన గ్రామాలకు నిధుల కేటాయింపునకు కృషిచేస్తానన్నారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు శారద, నరేందర్, మహిపాల్‌రెడ్డి, మారుతి, నారపాక రమేశ్, హరీశ్, రాంచంద్రం, చిక్రం భీంరావు ఉన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో రామకృష్ణారావు, ఏఈవో వైరాగ్యం అంజయ్య, అధికారులు హరిహరనాథ్, ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు.



సాక్షి | Special Story

- ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కీలక శాఖల్లో మహిళా అధికారులు
- సొంత నిర్ణయాలతో తమదైన ముద్ర
- పథకాలను ప్రజలకు చేరుస్తూ, సమస్యల పరిష్కారం
- పురుష అధికారులతో సమానంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శం

పాలనలో ఆమె సంతకం

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు మహిళా అధికారులు. సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, వారి సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉంటున్నారు. పురుష అధికారులతో సమానంగా విధులు నిర్వహిన్నారు. కిందిస్థాయి నుంచి మొదలుకొని జిల్లాస్థాయి అధికారిగా ఉంటూ ప్రజలకు సేవలందిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్, న్యాయ, రెవెన్యూ, విద్య, వైద్యం, మెప్మా, వ్యవసాయశాఖ తదితర శాఖల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. – సాక్షి,పెద్దపల్లి/కరీంనగర్ అర్బన్

కీలక స్థానాల్లో వారే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు శాఖల్లోని కీలకమైన స్థానాల్లో మహిళా అధికారులే ఉన్నారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిమ, జగిత్యాల జిల్లా కోర్టు న్యాయమూర్తిగా నీలిమ, కరీంనగర్ కలెక్టర్‌గా పమేలా సత్పతి, పెద్దపల్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా అరుణశ్రీ, పెద్దపల్లి డీసీపీగా డాక్టర్ చేతన, వేములవాడ ఏఎస్పీగా శేషాద్రినిరెడ్డి, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పేయ్, కరీంనగర్ డీఎంహెచ్‌వోగా సుజాత, డీఏవోగా భాగ్యలక్ష్మి, జగిత్యాల డీఏవోగా వాణి, కరీంనగర్ సంక్షేమ అధికారిగా సరస్వతి, ఆర్టీసీ ఆర్‌ఎంగా సుచరిత, రామగుండం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా హిమబిందు సింగ్, పెద్దపల్లి సహకార శాఖ అధికారి శ్రీమాల, పెద్దపల్లి డీఈవోగా మాధవి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారిగా కల్పన, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ అదనపు కమిషనర్‌గా నాయిని సుప్రియ.. ఇలా.. వివిధ శాఖల్లో మహిళా అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆలోచనా విధానం మారాలి

జీవితంలో అనేక పాత్రలు పోషిస్తున్నా.. మహిళలపై ఇప్పటికీ దాడులు జరుగుతున్నాయి. ఈ అనాగరిక ధోరణి నుంచి మనిషి ఆలోచనా విధానం మారాలని నిపుణులు సూచిస్తున్నారు. రాజకీయ రంగంలోనూ మహిళలు దూసుకెళ్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుతో వారి ప్రాతినిధ్యం మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఏ సంస్థలోనైనా, ఏ రంగంలోనైనా తగిన శిక్షణ, సానుకూల వాతావరణాన్ని కల్పిస్తే వారు అనూహ్య ఫలితాలు సాధిస్తారు.

మహిళల ప్రాతినిధ్యం పెరిగింది



అటెండర్ నుంచి అంతరిక్షం వరకు ప్రతీ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. నాకు అదనపు కలెక్టర్‌గా సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. మహిళలు రాజకీయాల్లో వెనకబడి ఉన్నారు. సివిల్ సర్వీసులోకి వచ్చే వారు 7 శాతమే. విజయానికి ఆడ, మగ అనే తేడా లేదు. లక్ష్యాలను నిర్దేశించుకొని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. ఆడపిల్లలను ప్రోత్సహించేవారి సంఖ్య పెరుగుతోంది. అది వంద శాతానికి చేరాలి. – లక్ష్మీకిరణ్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), కరీంనగర్

యువతుల్లో చైతన్యం కనిపిస్తోంది




పరిపాలనలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. జిల్లాలో చైతన్యం ఎక్కువ. ఆడపిల్లలంటే ఒకప్పుడు వివక్ష ఉండేది. ఇప్పుడు మార్పు వచ్చింది. వ్యవసాయశాఖకు జిల్లా అధికారిగా పని చేయడం సంతోషంగా ఉంది. పల్లెల్లో సమావేశాల్లో పాల్గొన్నప్పుడు యువతుల్లో చైతన్యం కనిపిస్తోంది. స్వయం ఉపాధి పొందేవారు, ఉన్నత విద్యనభ్యసిస్తున్నవారిని చూస్తే గర్వంగా అనిపిస్తోంది. – భాగ్యలక్ష్మి, డీఏవో, కరీంనగర్

చదువుతోనే సాధికారత




చదువుతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుంది. ఎంచుకున్న రంగంలో ప్రతిభ చాటేందుకు ఇష్టంగా ముందుకుసాగాలి. ఎవరి జీవితం అనతికాలంలో ఉన్నతస్థానానికి చేరదు. కఠోర శ్రమ అవసరం. లక్ష్య సాధనకు నిర్విరామ కృషి ఉండాలి. ఆడవాళ్లు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు పోటీపడాలి. ఏ రంగాన్ని ఎంచుకున్నా అందులో పరిపూర్ణత సాధించాలి. – అరుణశ్రీ, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

చట్టాలపై అవగాహన ఉండాలి



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఆత్మనిర్భరత, నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉండాలి. విద్య, వృత్తి, వివాహం, కుటుంబ వ్యవహారాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలి. ప్రభుత్వాలు మహిళల కోసం చేసిన చట్టాలు, న్యాయ సేవలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి. పోలీస్‌శాఖలో గతంతో పోలిస్తే మహిళా సిబ్బంది ప్రాతినిధ్యం పెరిగింది. – డాక్టర్ చేతన, డీసీపీ, పెద్దపల్లి

ఆడపిల్లలను ప్రోత్సహించాలి



ఆడపిల్లలకు వయసు రాగానే పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. అలా కాకుండా, వారు ఎంచుకున్న లక్ష్యాలు సాధించేవరకు ప్రోత్సహించాలి. లక్ష్యసాధనకు తోడ్పాటునందించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆడవారిని ఎలా గౌరవించాలో నేర్పించాలి. మగ, ఆడ అనే తేడా లేకుండా అందరూ సమానమేనన్న భావన కలిగించాలి. – మాధవి, డీఈవో, పెద్దపల్లి

చాలెంజ్‌గా తీసుకుంటా



కోల్‌సిటీ(రామగుండం): కొన్ని రంగాల్లో మహిళలు చిన్నచూపునకు గురవుతున్నారు. వాటిని పట్టించుకోకుండా ప్రతీ పనిని చాలెంజ్‌గా తీసుకోవాలి. నేను చాలెంజ్‌తో ముందుకు సాగుతున్నా. పురుషుల కన్నా మహిళకు ఇల్లు, ఫ్యామిలీ, ఉద్యోగం, అనారోగ్య సమస్యలు చాలా ఉంటాయి. లీడర్‌షిప్ క్వాలిటీస్ విషయంలో సపోర్ట్ దొరకదు. నిలోఫర్ ఆస్పత్రిలో హెచ్‌వోడీగా చేస్తున్న నన్ను, ప్రభుత్వం అడిషనల్ డీఎంఈ క్యాడర్ హోదా కల్పిస్తూ ప్రమోషన్ ఇచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన రామగుండంలోని సిమ్స్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా రెండున్నరేళ్ల క్రితం బాధ్యతలు అప్పగించారు. తొలి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన కొంతకాలం ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రొఫెషనల్ ఒత్తిళ్లతో బిజీగా ఉన్నా కుటుంబానికి సమయం కేటాయిస్తా. – డాక్టర్ హిమబిందు సింగ్, ప్రిన్సిపాల్, సిమ్స్, గోదావరిఖని

గణేశునికీ జియోట్యాగింగ్

- ఆన్‌లైన్‌లో విగ్రహాల వివరాలు
- ప్రతి మండపంపైనా ప్రత్యేక నిఘా
- జిల్లాలో 2,791 విగ్రహాల ప్రతిష్ఠ
- 100 శాతం జియోట్యాగింగ్ పూర్తి



జగిత్యాలక్రైం: జిల్లాలో వినాయక నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులోభాగంగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేవారు తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపర్చాలని ఆదేశాలివ్వడంతో వారు తమ వివరాలను నమోదు చేసుకున్నారు. వినాయక చవితి వేడుకల్లో ఎలాంటి అపశృతి చోటుచేసుకోకుండా పోలీసులు ప్రతి విగ్రహానికీ జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఎన్ని విగ్రహాలను ప్రతిష్ఠించారో పూర్తిస్థాయిలో వివరాలను సేకరించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నారు. జిల్లామొత్తంగా 2,791 మండపాలను ఏర్పాటు చేయగా.. 100 శాతం జియోట్యాగింగ్ పూర్తి చేశారు. వీటి వద్ద అనుకోని ఘటనలు జరిగితే పోలీసులు నేరుగా అక్కడికి చేరుకునే అవకాశం ఉంది.

అనుమతి తప్పనిసరి

నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాలకు అనుమతి తీసుకోవాలని పోలీసులు చెబుతూ వచ్చారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఠాణాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతి ఇచ్చారు. వీటిల్లో కొలువుదీరిన విగ్రహాలకు జియోట్యాగింగ్ చేస్తున్నారు. మండపాల దగ్గరగానీ, నిమజ్జనం ఊరేగింపు సమయంలోగానీ అనుకోని ఘటనలు జరిగితే క్షణాల్లో అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే అవకాశం ఉంది.

ఇలా చేస్తున్నారు..

ఎస్సైలు, బ్లూకోల్ట్స్, డయల్ 100 సిబ్బంది వద్ద ట్యాబ్‌లు ఉన్నాయి. గణపతి మంటప కమిటీ నిర్వాహకుల పేర్లు, ఫోన్ నంబర్లు, మంటపం ఏ ప్రాంతంలో ఉందో వివరాలతోపాటు గణపయ్య విగ్రహాన్ని ఫొటో తీసి ఆన్‌లైన్‌లో జియోట్యాగింగ్ చేస్తున్నారు. అందులోని లొకేషన్ ఆప్షన్‌ను నొక్కగానే వెంటనే మండపం ఏర్పాటు చేసిన ప్రాంతంలోని గుర్తులు నమోదు అవుతాయి. అలాగే నిమజ్జనం ఏ రోజున, ఏ చెరువులో చేస్తారనే వివరాలను సేకరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



విగ్రహాలను గుర్తించేందుకు పోలీస్ సిబ్బంది ఫొటో తీసి ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. రాత్రివేళ గస్తీ ముమ్మరం చేశాం. బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్, డయల్ 100 సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నిర్వాహకులు రాత్రివేళ మంటపాల్లో తప్పనిసరిగా ఉండాలి.

– అశోక్‌కుమార్, ఎస్పీ

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



కథలాపూర్:సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ కోరారు. మంగళవారం కథలాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు 59కులాల న్యాయబద్ధమైన పోరాటాల ఫలితమన్నారు. ఉద్యోగాల భర్తీని ఎస్సీ వర్గీకరణ ప్రకారం చేపట్టాలన్నారు. ప్రభుత్వం స్పందించి త్వరగా అమలు చేసి ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, సురుగు శ్రీనివాస్, అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్, నాయకులు కిషన్, రాజేశ్, తెడ్డు గంగాధర్, పాలెపు సంజీవ్, ప్రశాంత్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి



సారంగాపూర్: భారీ వర్షాలు పత్తి పంటపై ప్రభావం చూపుతున్నాయని, పత్తిచేనులో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణి రైతులకు సూచించారు. బీర్‌పూర్ మండలం రంగసాగర్‌లో ఆమె పత్తి, ఇతర పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తిలో నీరు నిల్వ ఉంటే ఎదుగుదల లోపిస్తుందన్నారు. ఇతర చీడపీడలు ఆశించే అవకాశం ఉందన్నారు. పత్తిలో వీలైతే కాలువలు ఏర్పాటు చేసి మురికి నీటిని తొలగించాలని సూచించారు. అనంతరం వరి పొలాలను పరిశీలించారు.ఆమె వెంట ఏఈవో అయ్యోరి వినోద్, రైతులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో విప్ లక్ష్మణ్, ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నేతలు

జగిత్యాల: పీసీసీ చీఫ్‌గా నియమితులైన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నేతలు మంగళవారం హైదరా బాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను స న్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అంతటి అన్నయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు

- మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించాలని డిమాండ్



ఆరెపెల్లిలో ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ధర్మపురి: మండలంలోని ఆరెపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మంగళవారం తమ పిల్లలతో కలిసి రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేపట్టారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 55 మంది విద్యార్థులున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండటం లేదని, అన్నంలో పురుగులు, వెంట్రుకలు రావడంతో నిర్వాహకులను అప్పటి ఎంఈవో పక్కన పెట్టారన్నారు. కానీ, వారు తమను తొలగిస్తూ ఎలాంటి జీవో రాలేదంటూ నిత్యం స్కూల్‌కు వచ్చి, తాత్కాలికంగా భోజనం వండుతున్నవారిని, విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. సుమారు రెండు గంటలపాటు ఆందోళన చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీడీవో రవీందర్, ఇన్‌చార్జి ఎంఈవో గంగాధర్, ఏఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. 15 రోజుల్లో కొత్తవారిని నియమిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. రెండు రోజులుగా పిల్లలు స్కూల్‌కు రాకపోవడంతో చదువులు ఆగిపోయాయని, బుధవారం నుంచి యథావిధిగా రావాలని హెచ్ఎం మధుకర్‌రెడ్డి సూచించారు.

పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- తల్లీకూతురి పరిస్థితి విషమం
- క్రిమిసంహారక మందు నోట్లో పోయగా తప్పించుకున్న కుమారుడు
- భర్త, అత్త వేధింపులే కారణం



చికిత్స పొందుతున్న మమత

ధర్మపురి: భర్త, అత్త వేధింపుల తాళలేక ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసింది. కొడుకు తప్పించుకోగా, తల్లీకూతురి పరిస్థితి విషమంగా ఉంది. మహిళ సోదరుడు శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని రాయపట్నంకు చెందిన పాయల శ్రీనివాస్‌కు అదే గ్రామానికి చెందిన మమతతో 19 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కట్నం కింద రూ.7.50 లక్షలు ఇచ్చారు. ఈ దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్ వ్యవసాయం చేస్తుంటాడు. కొంతకాలంగా అదనపు కట్నం తీసుకురావాలని మమతను ఆమె భర్త, అత్త వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ఐదేళ్ల క్రితం పుట్టింటి నుంచి రూ.10 లక్షలు తీసుకువచ్చింది. అయినా, వారు మరో రూ.10 లక్షలు తీసుకు రావాలని వేధిస్తున్నారు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా ఫలితం లేకపోయింది.

పిల్లలను పొలం వద్దకు తీసుకెళ్లి..

భర్త, అత్త వేధింపులను భరించలేక మమత మంగళవారం గ్రామ శివారులో ఉన్న పొలం వద్దకు ఇద్దరు పిల్లలను తీసుకొని, వెళ్లింది. అక్కడ ముందుగా కూతురు కన్యశ్రీకి క్రిమిసంహారక మందు తాగించి, తర్వాత తానూ తాగింది. కొడుకు శ్రవణ్‌కుమార్ నోట్లో బలవంతంగా పోయగా ఉమ్మివేసి, పారిపోయాడు. విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని, తల్లీకూతురిని జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారి పరిస్థితి విషమంగా ఉందని మమత సోదరుడు శ్రీనివాస్ తెలిపాడు. భర్త, అత్త వేధింపులే కారణమని పేర్కొన్నాడు. పోలీసులు ఆస్పత్రికి వెళ్లి, సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ఏ పార్టీకి సంబంధం లేకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తా
- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి



పోర్టబుల్ పబ్లిక్ అడ్రస్ సిస్టం అందిస్తున్న నరేందర్‌రెడ్డి

జగిత్యాల: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఈసారి జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ పార్టీకి సంబంధం లేకుండా పోటీ చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల తాను పుట్టిన గడ్డ అని, ఇప్పటికే ఏ పార్టీకి సంబంధం లేకుండా ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభించానని పేర్కొన్నారు. అవకాశం ఇస్తే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చూస్తానన్నారు. రాజకీయాల్లోకి వచ్చినా విద్యావ్యవస్థను వ దిలేది లేదని, రాజకీయంగానూ సక్సెస్ అవుతానని తెలిపారు.

పోర్టబుల్ పబ్లిక్ అడ్రస్ సిస్టం అందజేత

అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి మంగళవారం జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పోర్టబుల్ పబ్లిక్ అడ్రస్ సిస్టం అందజేశారు. త్వరలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భాగవత సప్తాహం ప్రారంభం



ధర్మపురిలో భాగవత సప్తాహం

ధర్మపురి: శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భాగవత సప్తాహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక శ్రీశారదా మహిళా మండలి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ధర్మపురికి చెందిన బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఈనెల 18 వరకు నిర్వహించనున్నారు. సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

బాలుడి వద్ద గంజాయి పట్టివేత

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని రాంనగర్ ఏరియాలో గంజాయి సరఫరా చేస్తున్న ఓ బాలుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బాలుడు (14) మంగళవారం సాయంత్రం సమయంలో ద్విచక్రవాహనంపై గణేశ్ మండపాల వద్ద నుంచి వేగంగా వెళ్తున్న క్రమంలో రాంనగర్ ఏరియావాసులు పట్టుకున్నారు. అతని వద్ద కొంత గంజాయి ఉన్న ప్యాకెట్ లభించినట్లు సమాచారం. వెంటనే స్థానికులు కోరుట్ల పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు అక్కడికి చేరుకొని బాలుడిని అదులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

జిల్లాస్థాయి యువజనోత్సవాలు

జగిత్యాలటౌన్: 28వ జాతీయ యువజనోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి రవికుమార్ తెలిపారు. సాంస్కృతిక, సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇన్నోవేషన్ కింద పలు అంశాల్లో పోటీలు ఉంటాయని, జానపద నృత్యం, జానపద పాటలు, లైఫ్ స్కిల్స్ కాంపొనెంట్, సైన్స్‌మేళా వంటివి ఉంటాయని, వివరాలకు 9059465889 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

కుక్క దాడిలో 10 మందికి గాయాలు



ఆస్పత్రి వద్ద బాధితులు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని భూషణరావుపేటలో కుక్క దాడిలో 10 మంది గాయపడ్డారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం వివిధ పనుల నిమిత్తం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న, బైక్‌లపై వెళ్తున్నవారిపై కుక్క దాడి చేసింది. గాయపడినవారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి, చికిత్స పొందారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు వాటిని దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతాశిశు సంక్షేమాధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో విషజ్వరంతో నలుగురు మృతిచెందగా జిల్లా వైద్యశాఖ అధికారులు గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలో పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికికాలువల్లో ఆయిల్‌బాల్స్ వేసి దోమల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్యామ్, శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ అన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి కొత్తగా ఉపకార వేతనం కావాల్సిన వారు, రెన్యువల్ చేసుకోవాల్సిన వారు డిసెంబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంజన్నను దర్శించుకున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నను స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, యాదాద్రి టెంపుల్ ఈవో భాస్కర్ మంగళవారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఈవో రామకృష్ణారావు, ఏఈఓ అంజయ్య, సూపరింటెండెంట్ హరిహరనాథ్ పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5 నుంచి 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన ఎస్సీ విద్యార్థులకు ఈనెల 12న కరీంనగర్‌లోని చింతకుంట సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ సెలక్షన్ ఉంటుందని జిల్లా సమన్వయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. జగిత్యాల, మెట్‌పల్లి, మేడిపల్లి, కోరుట్ల, గొల్లపల్లి గురుకులాల్లో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

నిమజ్జనానికి బందోబస్తు



చెరువును పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: గణేశుని నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో గణేశ్ శోభాయాత్ర వెళ్లే మార్గాలైన టవర్‌సర్కిల్, లడ్డూ ఖాజాచౌరస్తా, తీన్‌ఖని, నిమజ్జనం జరిగే చింతకుంట చెరువును పరిశీలించారు. పోలీస్ సూచనలను నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాటించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ తీస్తామన్నారు. డీఎస్పీ రఘుచందర్, సీఐలు అరీఫ్‌అలీఖాన్, వేణుగోపాల్, ఎస్సైలు సునీల్ రావు, రాంచంద్రం పాల్గొన్నారు.

మంచి పనులతో జన్మకు సార్థకత



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్

ఇబ్రహీంపట్నం: మంచి పనులతో మానవ జన్మకు సార్థకత లభిస్తుందని సామాజిక సామరత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో విశ్వహిందు పరిషత్, సామాజిక సమరత వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రులు, దేవీనవరాత్రులు హిందూ సమాజాన్ని ఏకం చేస్తున్నాయని తెలిపారు. గణనాథుడు అన్నివర్గాల వారని, 195 దేశాల్లో గణపతి నవరాత్రులు జరుగుతున్నాయని తెలిపారు. పండుగలను కుల, వర్గబేధం లేకుండా కలిసిమెలిసి జరుపుకోవాలని సూచించారు. గోధూర్ సాంస్కృతిక సభ్యులు కోలాటం ప్రదర్శించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తుకారం, సభ్యులు, నాయకులు నేమూరి సత్యనారాయణ, ఉటూరి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

అనుకున్నది చదవలేకపోయానని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య
- పెంబట్లలో విషాదం



సాయిచరణ్ (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): ఆర్థిక పరిస్థితుల కారణంగా అనుకున్నది చదవలేకపోయానని మనోవేదనకు గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని పెంబట్లకు చెందిన తేలు చంద్రయ్య–సుకన్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కొడుకులను పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడు సాయిచరణ్(21) తన మిత్రులతో కలిసి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనుకున్నాడు. కానీ, ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో జగిత్యాలలో డిగ్రీ చదువుతున్నాడు. అతని స్నేహితులు హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి, విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. దీంతో తాను అనుకున్నది చదవలేకపోయానని కుటుంబసభ్యులు, మి త్రుల వద్ద తరచూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై, ఈ నెల 4న రాత్రి 11 గంటల సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. తల్లిదండ్రులు జగిత్యాలలోని ఓ ప్రైవే ట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లా రు. అతను కోలుకోకపోవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖా నాకు తీసుకువచ్చారు. అక్కడ చికి త్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి విక్రేతల అరెస్టు

- 12 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్



అరెస్టు చూపుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం: అంతర్రాష్ట్ర గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల మండలంలోని పూడూరుకు చెందిన ఎడ్మలపల్లి సాయికుమార్, తుడుం సాయితేజ, కందుల అరుణ్, గౌరాపూర్‌కు చెందిన ఎడపెల్లి సాకేత్, జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన పాల రాజ్‌కుమార్, అఖిల్ కొంతకాలంగా ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి, గంజాయి తెస్తూ ఇక్కడ విక్రయిస్తున్నారు. సాయికుమార్, సాయితేజ బైక్‌పై వెళ్లి, ఒడిశా బార్డర్‌లో గుర్తు తెలియని వ్యక్తి వద్ద రూ.43 వేలకు 16 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఈ నెల 3న పూడూరుకు తీసుకువచ్చారు. గ్రామ శివారులో చెట్ల పొదల్లో దాచిపెట్టారు. అందులో నుంచి 4 కిలోల గంజాయిని అఖిల్ హైదరాబాద్ తీసుకెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం మిగతా 12 కిలోలను విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా కొడిమ్యాల ఎస్సై సందీప్, కానిస్టేబుళ్లు రాజయ్య, తిరుమల్, రాజు, వినోద్ పట్టుకున్నారు. గంజాయితోపాటు రెండు బైక్‌లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేశామని, అఖిల్ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి, ఎస్సై సందీప్, కానిస్టేబుళ్లను అభినందించి, రివార్డు అందించారు.

ఖానాపూర్‌లో శిశువు విక్రయం

- పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన యువతి సఖి కేంద్రానికి అప్పగించిన కుటుంబ సభ్యులు
- 21 రోజుల క్రితం మగబిడ్డకు జననం.. గుట్టుగా విక్రయం
- కూపీ లాగితే కదిలిన డొంక.. తల్లితో సహా ఆరుగురిపై కేసు

ఖానాపూర్: పుట్టిన 21 రోజులకే శిశువును విక్రయించిన సంచలన ఘటన ఖానాపూర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సఖీ సభ్యుల తనిఖీ సమయంలో శిశువు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూపీ లాగితే డొంక కదిలింది. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. ఖానాపూర్ సీఐ సైదారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన ఓ యువతి పెళ్లి కాకుండాగా గర్భం దాల్చింది. కుటుంబ సభ్యులు విషయం బయటకు రాకుండా ఆమెను నిర్మల్‌లోని సఖీ కేంద్రంలో చేర్పించారు. అక్కడే ఉంచి నెలనెలా వైద్య పరీక్షలు చేయించారు. 21 రోజుల క్రితం పురిటి నొప్పులు రావడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే బాబుకు జన్మనిచ్చింది. తర్వాత సఖీ సభ్యులు తల్లి, బిడ్డను తీసుకువచ్చి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫాలోఅప్‌లో భాగంగా ఈ నెల 6న తల్లీబిడ్డ పరిస్థితి తెలుసుకునేందుకు సఖీ సభ్యులు వచ్చారు. ఆ సమయంలో ఇద్దరూ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులను ఆరా తీశారు. వారు పొంతనలేని సమాధానం చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన సఖీ సభ్యులు శిశువు అమ్మమ్మతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు.

కూపీ లాగితే కదిలిన డొంక..

మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో కలిసి రంగంలోకి దిగారు. ఖానాపూర్, కడెం మండలాల్లో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కడెం మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన టేకం రాధ(యువతి చిన్నమ్మ)తో కలిసి మధ్యవర్తి కొమ్ము భాగ్య సహకారంతో రూ.52 వేలకు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన బెక్కం రాధకు విక్రయించినట్లు గుర్తించారు. దీంతో రంగపేటకు వెళ్లి శిశువును స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు చూపించిన అనంతరం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణలో భాగంగా సకాలంలో స్పందించి నిందితులను పట్టుకునేందుకు కృషిచేసిన సీఐతోపాటు ఎస్సై లింబాద్రిని ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

ఆరుగురిపై కేసు..

ఈ ఘటనకు సబంధించి బాలుడి తల్లితోపాటు, చిన్నమ్మ టేకం రాధ, కొమ్ము గంగారం అలియాస్ యోగి, కొమ్ము భాగ్య, జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేట్‌కు చెందిన శిశువు కొనుగోలుదారులు బెక్కం లక్ష్మీరాజం, బెక్కం రాధపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సైదారావు తెలిపారు.

సురక్షితంగా శిశువు...

అపహరణకు గురైన 21 రోజుల శిశువు ఆరోగ్యంగానే ఉన్నాడని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో కలిసి పోలీసులు శిశువును కాపాడినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆసుపత్రిలో బాలుడిని పరిశీలించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఘటనకు బాధ్యులపై కఠినచర్యలు ఉంటాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 1098 టోల్‌ఫ్రీకి లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 63056 46600 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

హైకోర్టు తీర్పుపై హర్షం



మాట్లాడుతున్న మాజీ జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత కేసుపై హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా స్వామ్య పరిరక్షణకు రాజకీయాలకు అతీతంగా అనర్హత వేటు వేసి న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె వెంట నాయకులు కమలాకర్‌రావు, గంగారెడ్డి, తిరుపతి, ఆసీఫ్ పాల్గొన్నారు.